క్లుప్తంగా

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, చిన్నారులు

మల్కాపురం: తల్లిదండ్రులు పిల్లలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా మల్కాపురం శాఖ గ్రంథాలయం వద్ద సోమవారం గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు విద్య ఆవశ్యకతను తెలియజేయాలని, పుస్తకాలు చదవడంపై అభిలాష పెంచాలని అన్నారు. చిన్నారుల భావాలకు పునాది వేసేవారు తల్లిదండ్రులు అని ఆమె వివరించారు. పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారు సరైన దారిలో నడిచే విధంగా చూసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్ వద్దు,చదువే ముద్దు అన్న విధంగా పిల్లలు ఉండాలన్నారు. చిన్నారులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

మహతి కాలేజీలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సు

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్‌లోని మహతి డిగ్రీ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రిన్సిపాల్ గండి మధుసూధన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ(సీఎస్), బీబీఏ ఆనర్స్ డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. క్లయిమేట్ కలెక్టివ్ సంస్థ ద్వారా స్టార్టప్ ల్యాబ్‌లో ఏఐ, డేటా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సును అభ్యసించిన వారికి దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యత కోర్సుల్లో నైపుణ్య శిక్షణ సాధించటం ద్వారా డిగ్రీ పూర్తి చేసుకునే విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని కాలేజీ చైర్మన్ జి.ఎల్.ఎన్.రాజు తెలిపారు.

300వ రోజుకు పోర్టు ఆస్పత్రి పరిరక్షణ దీక్షలు



పోర్టు హాస్పిటల్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను ఆపాలని కైలాసపురం పోర్టు ఆస్పత్రి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు 300వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మానవ హారం నిర్వహించారు. అనంతరం సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పద్మనాభరాజు మాట్లాడుతూ ఈ పోరాటం వల్ల గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ టెండర్‌కు ఎవరూ రాలేదని, ఆస్పత్రి అభివృద్ధి కోసం చైర్మన్ కమిటీ వేశారన్నారు. పోర్టు హాస్పిటల్‌ను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, ఈ విషయంపై కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం అనర్థమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని ఆయన హెచ్చరించారు. దీక్షకు బీహెచ్ఈఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.టి.ప్రకాష్, డాక్‌యార్డ్ యూనియన్ నాయకుడు గణేష్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, గణేష్, శంకరరావు, నర్సింగరావు, త్రినాథరావు, ఈశ్వరరావు, రాఘవులు, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సు శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద మహారాణిపేటలోని నాక్ కేంద్రంలో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. ఇంటర్ చదివి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తామని, స్టేషనరీ అందజేస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీ చేసి, సంబంధిత రంగంలో ఉపాధి కల్పించనున్నారని, వివరాలకు 96761 70026, 798957 2891 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ట్రాన్స్‌ఫార్మర్ లేని భవనం ఇదే

- అందిన కాడికి దోచేస్తున్న వైనం
- అఫీషియల్‌గా ఇద్దరు... అనఫీషియల్‌గా 10 మంది వరకూ..
- విభాగాల వారీగా పెత్తనం చేస్తూ దోపిడీ
- సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారి నంబర్లు సేకరించి బేరాలు
- సోషల్ మీడియాలో వీరి బాగోతాలు వైరల్



కొత్తపాలెం యర్ర చెరువు సమీపంలో అక్రమ నిర్మాణం

పశ్చిమలో పీఏలదే హవా!

గోపాలపట్నం: ఎమ్మెల్యేతో చెప్పుకుంటే సమస్యలు తీరుతాయని నమ్మి ప్రజలు వస్తే ఆయన పీఏలు జేబులు ఖాళీ చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. జీవీఎంసీలో ఉద్యోగాలు వేయించాలని, రైతు బజారులో దుకాణాలు కావాలని, కరెంటు మీటర్లు కావాలని ఇలా పలు రకాల పనుల కోసం వచ్చేవారిని సంప్రదించి ఆ పని తాము చేయిస్తామంటూ పీఏలు దోచుకుంటున్నారు. కొంతమంది ఎమ్మెల్యే పీఏల మంటూ అధికారులకు ఫోన్లు చేసి బెదిరించి, ఒత్తిడి తెచ్చి పనులు చేయిస్తున్నారు. ఇదంతా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కార్యాలయంలో జరుగుతున్న తంతు.

అదనపు అంతస్తు వేస్తే కప్పం కట్టాల్సిందే...

నియోజకవర్గంలో ఎక్కడైనా అదనపు అంతస్తు వేస్తే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు కట్టాల్సిందేనని పలువురు బిల్డర్లు వాపోతున్నారు. అమ్మకాలు తగ్గిపోవడంతో అంతేసి ఇవ్వలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నాయకుల కనుసన్నల్లో ఆక్రమణలు

జీవీఎంసీ 89వ వార్డు ఎర్ర చెరువు దరి 170 సర్వే నంబర్ ప్రాంతాల్లో కబ్జాలకు కూటమి నాయకులు కొమ్ముకాస్తున్నారు. యర్రచెరువు ప్రాంతంలో అనధికారికంగా నాలుగు నిర్మాణాలు చేపడుతున్నారు. వీరి ఒత్తిడి వల్ల గోపాలపట్నం రెవెన్యూ అధికారులు సైతం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్లు రావడంతో ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తూ ఉండి పోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సోషల్ మీడియాలో వైరల్

అధికారిక,అనధికారిక పీఏల అవినీతిపై సోషల్ మీడియాలో వైరల్ అవడం విషయం హాట్ టాపిక్‌గా మారింది. టీడీపీ కార్యకర్తల దగ్గర సైతం వీరు దోచేస్తున్నారని చర్చించుకోవడం ఆసక్తిని రేపుతోంది.

ఇదీ పరిస్థితి

గణబాబు వద్ద ఇద్దరు అధికారిక పీఏలు ఉన్నారు. వీరితో పాటు ఎమ్మెల్యే వెనుక ఉంటున్న కొందరు పీఏలుగా చలామణి అవుతున్నారు. వీరిదే హవా ఎక్కువ. వీరితో పాటు ఒక అధికారిక పీఏ(వ్యక్తిగత సహాయకుడు) కలిసిపోయి ఉద్యోగాలు వేయిస్తామని కొంత మంది వద్ద రూ. 40వేల చొప్పున వసూలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కొత్తపాలెంలో ఒక భవనానికి కరెంటు మీటర్లు తక్కువ ఖర్చుతో వేయించి కమీషన్లు కొట్టేశారని ప్రచారం సాగుతోంది. ఈ భవనానికి చిన్న ట్రాన్స్‌ఫార్మర్ వేయాల్సి ఉంది. అలా కాకుండా 5 మీటర్లు వేయించేశారు. ట్రాన్స్‌ఫార్మర్ వేయించాలంటే లక్షల్లో ఖర్చు అవుతుందని... దానిలో కొంత శాతం తమకు ఇవ్వాలని వసూలు చేసినట్లు తెలుస్తోంది.



మినీ ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా వేసిన మీటర్లు

నా అనుమతి లేకుండా అడుగు పెడతావా?

తహసీల్దార్‌పై టీడీపీ కార్పొరేటర్ చిన్నా చిందులు

మల్కాపురం: ఓ స్థలానికి సంబంధించిన విషయంలో టీడీపీ కార్పొరేటర్ ములగాడ తహసీల్దార్‌పై చిందులేశాడు. నా అనుమతి లేకుండా వార్డులోకి ఎలా వస్తావు అంటూ వాదించాడు. నేను మండల అధికారిని.. సమస్య పరిశీలనకు వస్తే మీ అనుమతి ఎందుకు అని తహసీల్దార్ చెప్పినా కార్పొరేటర్‌తో తగ్గలేదు. తహసీల్దార్‌ను నువ్వు ..నువ్వు అని సంభోదించడంతో అక్కడ ఉన్నవారు... తహసీల్దార్ పరిస్థితి ఇలా ఉంటే..సామాన్యుల పరిస్థితి ఇంకెలా ఉంటుందో అని చర్చించుకున్నారు.

ఇదీ విషయం

జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైఆంధ్రకాలనీ ప్రాంతంలో 2015లో ఓ వ్యక్తికి 41 చదరపు గజాలతో కూడిన ఇంటి పట్టా ఇచ్చారు. ఆ వ్యక్తి ప్రభుత్వం ఇచ్చిన స్థలం కంటే అదనంగా కొంత స్థలం ఆక్రమించాడని ఫిర్యాదు వచ్చింది. దీంతో తహసీల్దార్ ఎం.రమేష్ ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పట్టాలో ఉన్న స్థలం కాకుండా వేరే స్థలంలో నిర్మాణం చేస్తే తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో సదరు వ్యక్తి వార్డు 63వ వార్డుకు చెందిన టీడీపీ కార్పొరేటర్ గల్లా చిన్నా వద్దకు వెళ్లి విషయాన్ని చెప్పాడు. దీంతో కార్పొరేటర్ తన వర్గంతో సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ రమేష్‌తో వాదనకు దిగారు. నా అనుమతి లేకుండా వార్డులోకి వస్తారా అంటూ ప్రశ్నించారు. నేను రావడానికి మీ అనుమతి ఎందుకు అని తహసీల్దార్ చెప్పినా వినిపించుకోలేదు. ఏ సమస్య అయినా నేనే పరిష్కరిస్తా అని కార్పొరేటర్ వాదించినట్టు తెలిసింది.అంతటితో ఆగకుండా ఎమ్మెల్యే గణబాబుకు ఫోన్ చేసి కార్పొరేటర్ చిన్నా తహసీల్దార్‌పై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కార్పొరేటర్ వ్యవహరించిన తీరును చూసి దరఖాస్తుదారులతో పాటు సిబ్బంది విస్మయం చెందారు.

ప్రజలను మోసం చేయడంలో బాబు ఘనుడు



మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్



కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- 56వ వార్డులో ఉత్సాహంగా బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ

కంచరపాలెం: దగా, మోసం, వెన్నుపోటులో టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు 40 ఏళ్ల అనుభవం ఉందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ధ్వజమెత్తారు. జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దరి ఆర్పీపేట గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం కమ్యూనిటీహాల్‌లో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని ఊదరగొట్టిన కూటమి నాయకులు ఏడాదిపాలనలో హామీలు అమలు చేయలేక విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రచారం మాత్రం చేసుకుంటున్నారన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చామన్నారు. ఇచ్చిన హామీలు కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేసి గర్వంగా గడపగడపకు వెళ్లి చెప్పుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఒక పని చేయకపోయినా ఎంతో చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయండి అని అడిగిన వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కరోనా విపత్కర సమయంలో కూడా జీడీపీ దిగజారకుండా జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన విధానంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపించారన్నారు. వార్డులోని ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కరపత్రాలు ఆవిష్కరించి కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కె.పైడి రత్నాకర్, ఎం.నూకరాజు, ఎస్ సాయిలత, డి.అప్పలరాజు, సీహెచ్ సరోజిని, కె.రమేష్, ఎం.రామకృష్ణ, బొడ్డేటి చిన్న, పి.త్రినాథ్‌రెడ్డి, షేక్ రఫీ, బి.ప్రసాద్, శ్యామ్యూలు, ఎం.స్వర్ణలత, ప్రమీల, వెంకటరావు, అనంత పద్మనాభం, కె.వి.రమణ, ఎం.రాజ్యం, బి.సాయిలక్ష్మి, కె.ఎస్ రత్నం, ఎం.శ్రీకాంత్, లీలా, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడిపిస్తారా..అమ్మేస్తారా!

- ఎఫ్ఆర్‌యూలో కానరాని వైద్యులు
- ఫార్మసిస్ట్‌తోనే నిర్వహణ



రోగులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



ఖాళీగా మంచాలు



ట్రేలో ఉన్న మందులే దిక్కు

మల్కాపురం: నాలుగు దశాబ్దాల చరిత్ర గల ప్రజా వైద్యశాల కొనసాగుతుందా.. మూసేస్తారా అన్న సందేహం వ్యక్తమవుతోంది. 24 గంటలూ సేవలందించాల్సిన వైద్యశాలకు డాక్టర్లు లేరు. మందులు ఉండడం లేదు. ఫార్మసిస్టుతోనే రోగులకు సేవలు అందిస్తున్నారు.దీంతో గుల్లలపాలెంలోని 30 పడకల ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యూ) భవితవ్యంపై నీలినీడలు అలముకున్నాయి.పారిశ్రామిక ప్రాంత ఏడు వార్డుల ప్రజలకు వైద్యం గగనంగా మారింది. కూటమి సర్కారు ఆస్పత్రి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఆదివారం ఉదయం ఇద్దరు యువకులు వైద్య సేవల కోసం వస్తే వైద్యులు లేరు. సోమవారం కూడా ఆస్పత్రికి వైద్యులు రాలేదు. ఫార్మాసిస్టు వైద్య సేవలు అందిస్తున్నారు.ఎంతో పేరు గాంచిన ఎఫ్ఆర్‌యూకి ఇలాంటి పరిస్థితి వచ్చిందని.. పేదలకు వైద్యం భారం కానుందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్మార్టు మీటర్ల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు సత్యాంజనేయ

మల్కాపురం: గృహాలకు స్మార్టు విద్యుత్ మీటర్లు బిగించి వినియోగదారులను మరింత ఆర్థిక ఇబ్బందులకు గురి చేసేందుకు కూటమి సర్కారు సన్నాహాలు చేస్తుందని సీపీఐ జిల్లా నాయకుడు కాండ్రేంగుల సత్యాంజనేయ అన్నారు. 61వ వార్డు వెంకన్నపాలెంలో స్మార్టు మీటర్ల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్మార్టు మీటర్ ఇంటికి బిగిస్తే ప్రతి నెలా అదనపు ఆర్థిక భారం తప్పదన్నారు. రీచార్జి అయిన మరు క్షణమే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. మీటర్‌కు అయ్యే ఖర్చు ప్రతి నెలా వినియోగదారుడే భరించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 31న సాయంత్రం 4 గంటలకు గాజువాక ఆర్టీసీ డిపో నుంచి మల్కాపురం వరకు వామపక్ష పార్టీల నాయకులు,కార్యకర్తలు,ప్రజా సంఘాలు కలిసి నిరసన ర్యాలీ చేపడతామన్నారు.ప్రజలంతా పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి,పెంటారావులతో పాటు సీపీఐ నాయకుడు గుడాల రాంబాబు, గండి అప్పారావు,ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు చేస్తే సహించం



మాట్లాడుతున్న బక్క పరంజ్యోతి

సీతంపేట: దళిత క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి హెచ్చరించారు. దళితుల హక్కుల సాధన కోసం అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతులు లేని చర్చిలపై కూటమి ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులపై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్, ఇపుడు బీజేపీ ప్రభుత్వాలు ఎటువంటి సాయం చేయడం లేదని చెప్పారు. దేశంలో మతం మారడం స్వేచ్ఛతో కూడిన హక్కని, దానిని కాలరాస్తామంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు వివిధ రూపాల్లో పోరాడుతామని తెలిపారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్, తదితరులు

గోపాలపట్నం: దేశ ప్రజలతో పాటు శాస్త్రవేత్తలకు ఆదర్శప్రాయుడు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ కొనియాడారు. ఎన్ఎస్‌టీఎల్‌లో భారత రత్న డాక్టర్ అబ్దుల్ కలాం 10వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ఉన్న ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన కలాం విగ్రహానికి అబ్రహం వర్గీస్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఎల్‌కు కలాంకు అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సూచనలిస్తున్న మలేరియా విభాగ అధికారి రవికుమార్

మల్కాపురం: జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మల్కాపురం మలేరియా విభాగ అధికారులు సోమవారం శ్రీహరిపురంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ మట్లాడుతూ విద్యార్థులు తమ ఇంట్లో నీటి కుండీలపై మూతలు ఉన్నాయా లేదా గుర్తించాలన్నారు. లేకపోతే పై కప్పులను అమర్చుకోవాలని సూచించారు. రెండు రోజులకు మించి నీరు తొట్టిలో ఉంటే వెంటనే వాటిని పారబోయాలని సూచించారు. మొక్కల కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. చెడిన పదార్థాలను ఇంట్లో ఉంచుకోవద్దన్నారు. ఇంటి పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఇంటి ముందు,వెనుక కాలువల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచన చేశారు.కార్యక్రమంలో మలేరియా విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీలు

- బయటపడిన పోలీస్ స్టేషన్ల లోపాలు

తాటిచెట్లపాలెం: విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేపట్టిన అర్ధరాత్రి తనిఖీల్లో పలు పోలీస్ స్టేషన్లలోని లోపాలు బయటపడ్డాయి. వివరాలిలా.. ఆదివారం అర్ధరాత్రి దాటాక ద్వారకా, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫోర్త్ టౌన్ పీఎస్‌లో విధులు నిర్వర్తించాల్సిన సెంట్రీ నిద్రపోవడాన్ని గుర్తించారు. ద్వారకా స్టేషన్ నిబంధనలకు విరుద్ధంగా తలుపులు మూసి ఉండటాన్ని గమనించారు. వెంటనే సిబ్బందికి మోమోలివ్వాలని సంబంధిత ఏసీపీలకు కమిషనర్ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో స్వామికి అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

'సినారె' రచనలు సందేశాత్మకం



సినారె సాహిత్య సమాలోచన సదస్సులో పాల్గొన్న సాహితీవేత్తలు

సీతంపేట: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకుని విశాఖ పౌర గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం పబ్లిక్ లైబ్రరీలో సినారె సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి రచించిన చారిత్రక గేయ కథా కావ్యం కర్పూర వసంత రాయలులోని కథన శిల్పాన్ని శైలీ సౌకుమార్యాన్ని దేశం కోసం వ్యక్తులు త్యాగం చేయాల్సిన అవసరాన్ని సందేశాత్మకంగా వ్యక్తం చేశారని వివరించారు. కొండవీటి కుమారగిరి రెడ్డి కాలంనాటి చారిత్రక గాథను రస రమ్యంగా అక్షరీకరించారన్నారు. రాంభట్ల నృసింహశర్మ సి.నా.రె. గీతాలు ఆలపించి, వాటి సౌందర్యాన్ని ఆవిష్కరించారు. సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, డాక్టర్ కె.ఎ స్.ఎస్.మూర్తి, శివాజీ, రాధారాణి, నిర్మల, ఉప్పల అప్పలరాజు ప్రసంగించారు.

బాలోత్సవం పోటీలకు ఆహ్వానం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో బాలోత్సవం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థుల కోసం 45 రకాల సాంస్కృతిక, అకడమిక్ ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలోత్సవం పోటీల్లో ఎన్ఏడీ కొత్త రోడ్, సింహాచలం, నరవ, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆయా పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతాయన్నారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్లు ప్రతి పాఠశాలకు అందిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 6లోపు ఏయే అంశాల్లో పాల్గొంటారో వివరంగా అందించాలని సూచించారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో జరగనున్న బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. జిల్లా బాలోత్సవం కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి శేషగిరిరావు, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ ప్రతినిధులు రమాప్రభ, సతీష్, కళాశాల అధ్యాపకురాలు నాగమణి, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు ఎస్సీ అప్పారావు, కె.నర్సింగరావు, శంకర్రావు, మహేష్, సతీష్ పాల్గొన్నారు.